AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-15 | December 2023 Special Issue | ISSN: 2583-4797
**Article Link:** https://www.auchithyam.com/2023/dec_2023_spl/full_papers/december23_spl_44.php

# "కమనీయం తెలుగు రామాయణం"

## జాతీయసదస్సు నవంబర్-2023 ప్రత్యేకసంచిక

**(ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) సిద్దిపేట, సిద్దిపేట జిల్లా, తెలంగాణ రాష్ట్రం.)**

# 44. తెలుగు రామాయణాలు: అవాల్మీకాలు

**డా. బాసాని సీతారాములు**

సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ,
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల,
సిద్దిపేట, తెలంగాణ.
సెల్: +91 9666494466. Email: basani0707@gamil.com

**వ్యాససంగ్రహం:**

*భారతీయ సంస్కృతిలో రామాయణ కథ అత్యంత ప్రధానమైనది. సీతారాముల కథ ప్రజలను మంత్రముగ్ధులను చేసింది. వారి జీవితాల్లో, సుఖదుఃఖాలలో, సంతోషాలలో నిత్యం ప్రతిబింబిస్తుంది. దేశంలోని అనేక ప్రాంతాల అనేక భాషల ప్రజలు వారి సంస్కృతులు, ఆచారాలు, పద్ధతులకు అనుగుణంగా రామాయణ కథను మలుచుకొని తమ సొంతం చేసుకున్నారు. ఈ క్రమంలో వాల్మీకి రామాయణంలో లేని అనేక అంశాలు జనబాహుల్యంలో వినపడే రామాయణాల్లో ఉన్నాయి. రామాయణ అనువాదంలో ప్రాంత ప్రాబల్యాన్ని, అస్తిత్వాన్ని, సంస్కృతులను స్వాభిమానంతో జోడించడం కొన్ని త్యజించడం, మరికొన్ని మూల విస్తరణం చేయడం జరిగింది. కనుక తెలుగు రామాయణాలలో గల అవాల్మీకాంశాలను అధ్యయనం చేసి తెలియ చెప్పవలసిన అవసరం ఏర్పడింది. రంగనాథరామాయణం, నిర్వచనోత్తరరామాయణం, ఆధ్యాత్మికరామాయణం, జానపదరామాయణం, మొల్ల రామాయణం వంటి కొన్ని ప్రామాణిక తెలుగు రామాయణ గ్రంథాలను, తీసుకొని పరిశీలించి వాల్మీకి రామాయణంలో లేని అంశాలు వీటిలోకి ఎందుకు వచ్చాయి కారణమేమిటి అనే దిశగా పరిశోధన చేయడం జరిగింది.*

**Keywords:** అవాల్మీకాలు, మూల సంక్షేపణం, మూల విస్తరణం, ఘన ఖడ్గములు, మందాకిని, తారా శాపము, ధ్యానమాలి, తృనాంగి ముని, తులానాత్మక పరిశీలన, రావణ కాష్టం, పాతాళ హోమం.

## 1. ఉపోద్ఘాతం:

భారత సమాజం సంస్కృతిపై రామాయణ ప్రభావం గణించవీలు కానిది. దేశం లోని అన్ని ప్రాంతాలను, భాషలను అత్యంత ప్రభావితం చేసిన కథ రామాయణ కథ. శ్రీరామచంద్రుణ్ణి ఆదర్శ పురుషునిగా సీతాదేవిని లోకమాతగా ఆరాధిస్తూ రామాయణమందలి పాత్రలలో తాదాత్మ్యం చెంది వారి సుఖదుఃఖములను తమవిగా

భావించి ప్రజలు తమకు నచ్చిన తీరుగా తలపోశారు. సీతారాముల యందు గల భక్తి భావంచే వాల్మీకి రామాయణంలో లేని అనేక అంశాలను తెలుగు రామాయణాలలో చొప్పించారు. దేశం లోనేకాక విదేశి సంస్కృతులలో కూడా రామాయణ కథ ఛాయలు కనిపిస్తాయి.

ఈ క్రమంలో ఆయా ప్రాంతాల ప్రజలు వారి సంస్కృతులను ఆచారాలను రామాయణ కథకు జోడించి వారి ఆచారాలను ఉన్నతీకరించుకున్నారు. ఆ విధంగానే తెలుగు రామాయణాలలోనూ అనేక అవాల్మీకాంశాలు చోటుచేసుకున్నాయి.

## 2. అవాల్మీకాలు పరిచయం :

తెలుగు రామాయణ కవులు అక్కడక్కడ వాల్మీకి రామాయణంలో లేని అంశాలను కొన్ని చొప్పించారు. కల్పితం చేశారు. అనుచితం అనిపించిన చోట్ల తొలగించారు. గౌతముడు అహల్యను శపించుట, దశరధుని పుత్రకామేష్టి యాగంలో రావణుని పూర్వజన్మ వృత్తాంతం, దశరథ కుమారుల జన్మ తిధులు, మందరకు రాముని పై ద్వేషమునకు కారణం, కాకాసురుని వృత్తాంతం, సీత జన్మ వృత్తాంతం, లక్ష్మణుని నిద్ర ప్రతిజ్ఞ, ఆగస్త్యుడు రామునికి అనేక దివ్యాస్త్రములు ఇచ్చుట, మందాకిని సీత జాడ చెప్పుట, తారా శాపము, సంపాతి రామభక్తి, హనుమంతుడు స్వీయ జన్మ వృత్తాంతమును వానరులకు చెప్పుట, హనుమంతుడు సూర్యబింబం మింగుట, తృణాంగి ముని ఆశ్రమము, లంకా దహన సందర్భంగా హనుమంతుడు, విభీషణుడిని రావణుడు దండించుట, రామసేతు నిర్మాణంలో నలుని విఘ్నేశ్వర పూజ, సేతు బంధనమున రామునికి సముద్రుడు ప్రత్యక్షం, రావణుడి మరణం గురించి కుంభకర్ణుడుముందే చెప్పడం, మండోదరి రామునితో సంధికై రావణునికి సలహా ఇచ్చుట, ధ్యానమాలి వృత్తాంతం,హనుమంతుడు ద్రోణాద్రిని పెకిలించిన సందర్భం, రావణుని పాతాళ హోమం, విభీషణుడు రాముని తో రావణుని ప్రాణ రహస్యం చెప్పుట, చాకలి వృత్తాంతం, రావణ కాష్టం, లక్ష్మణ రేఖ, అహల్య రాయిగా మారుట, శబరి వృత్తాంతం మొదలగు అనేక అంశాలు గలవు.

## 3. బాలకాండము- అవాల్మీకాలు విశ్లేషణ:

### 1. గౌతముడు అహల్యను శపించుట :

భాస్కర రామాయణంలో అహల్యను గౌతముడు "**వాయుబక్షణవు నిరాహారవు, దస్మశాయినివై, ఎవరికి కనపడకుండా, పాషానం బై ఉండుము".**[1] అని ఒక గద్యంలో గౌతమముని అహల్యను శిల కమ్మని శపించినట్లు వర్ణించబడింది. ఇది రంగనాథ రామాయణం, ఆధ్యాత్మిక రామాయణం, పద్మ పురాణంలోనూ గలదు. కానీ వాల్మీకి రామాయణంలో పాషాణం కమ్మని మాత్రం లేదు.

## 2. దశరథుని పుత్రకామేష్టి యాగంలో రావణుని పూర్వజన్మ వృత్తాంతం:

దశరథుడు తలపెట్టిన పుత్రకామేష్టి యాగానికి దేవతలు మహర్షులు వచ్చి ఉంటారు. యాగ సమయంలో దేవతలు బ్రహ్మతో రావణుడు తమకు కలిగించు బాధలను గురించి చెప్పుకుంటారు. ఈ సందర్భంగా రావణుడు పూర్వజన్మలో హిరణ్యకశిపుడని అతన్ని విష్ణుమూర్తి నరసింహావతారమై వధించెనని' బ్రహ్మ దేవతలతో చెప్పినట్లు భాస్కర రామాయణంలోని క్రింది పద్యంలో చెప్పబడింది." **నరసింహ కృతి భూమి భీకరగతిన్ నారాయ నుండుద్ధతో........................ ద్ధర జన్మించెను రావణుండన బులస్త్య బ్రహ్మకుం బుత్రుడై**"[2] (I ,142)

అదేవిధంగా ఈ అంశము రంగనాథ రామాయణంలోని క్రింది పద్యంలో కలదు.

"**విశదంబుగా నింక వినుడు లోకముల్ గారించునాడు నారాయణుండు............ వాడే వీడై విశ్రవసునకు పుట్టినాడు**"[3]. కానీ, రావణుని పూర్వజన్మ వృత్తాంతం వాల్మీకి రామాయణంలో కానరాదు.

## 3. దశరథ కుమారుల జన్మ తిథులు :

వాల్మీకి రామాయణంలో కేవలం శ్రీరాముని జన్మతిథి మాత్రమే పేర్కొనగా భరతుడు దశమినాడు లక్ష్మణుడు ఏకాదశి నాడు జన్మించినట్లు చెప్పబడింది.[4] మొల్ల తన రామాయణంలో శ్రీరామాదులందరును నవమి భాను వారమున జన్మించినట్లు వర్ణించింది.[5] శ్రీ రామాదులు భానువారం జన్మించారని చెప్పుటకు వారు భాను(సూర్య)వంశీయులు కావడం వల్ల కావచ్చు.

## అయోధ్యకాండము:

## 4. మందరకు రాముని పై ద్వేషమునకు కారణం :

మందరకు రాముని పై ద్వేషం కలుగుటకు వాల్మీకి రామాయణంలో కారణమేమి కానరాదు. అందులో మందర 'పాప దర్శిని 'అని మాత్రమే చెప్పబడింది. కానీ రంగనాథ రామాయణంలో రాముడు బాల్యంలో " **తన కాలు విరిచిన తప్పు సాధింప నిది నాకు దరి**" అని మందర తన కాలు విరగొట్టిన రాముని పై కక్ష పెంచుకొని ఆద్వేషంతోనే రామున్ని అడవులకు పంపేందుకు పురిగొల్పిందని తెలుపబడింది.[6]

## 5. కాకాసురుని వృత్తాంతము :

వాల్మీకి రామాయణంలో సుందరకాండలో గల ఈ కథ భాస్కరరామాయణంలో "**సీతారాములు చిత్రకూట పర్వతంపై విహరించే సందర్భంలో అయోధ్యకాండలో కనబడుతుంది**"[7]. ఆధ్యాత్మిక ఆనంద రామాయణాలలోనూ ఈ కథ అయోధ్యకాండలోనే వర్ణించబడింది.[8]

### 6. సీత జన్మవృత్తాంతం :

అనసూయతో సీత తన వివాహం గురించి చెప్పే సందర్భంలో తన జన్మ వృత్తాంతం కూడా చెప్పినట్లు భాస్కర రామాయణంలో కనిపిస్తుంది.[9] కానీ వాల్మీకి రామాయణంలో ఈ విషయం లేదు. సీతాదేవి జన్మమునకు మేనకకు సంబంధం కల్పించుట సీతను ఆమె మానస పుత్రికగా పేర్కొనుట వాల్మీకి రామాయణంలో లేదు.

### 7. లక్ష్మణుని నిద్ర ప్రతిజ్ఞ:

సీతారాములు గంగా నది తీరాన గుహని ఆశ్రమమున సేదతీరుతున్నప్పుడు లక్ష్మణుడు 14 ఏళ్లు నిద్ర వదిలి అహర్నిశలు రాముని సేవ చేస్తానని ప్రతిజ్ఞ చేశాడని భాస్కర రామాయణంలోని ఈ పద్యంలో తెలుపబడింది."**ఆ పదునాలుగేడులు నహర్నిశ ముందన నిద్ర తప్పియా................ నా శరనాధున కద్దెప జూపి వెండి యున్.**"[10] ఈ ప్రతిజ్ఞ అంశము వాల్మీకి రామాయణంలో కానరాదు.

### అరణ్యకాండము :

### 8. ఆగస్త్యుడు రామునికి అనేక దివ్య అస్త్రములు ఇచ్చుట :

రాముడు అగస్త్య ఆశ్రమం దర్శించినప్పుడు ఆగస్త్యుడు రామున్ని తగు రీతిన ఆదరించాడు ఆ సమయంలో రామునికి దివ్యమైన రెండు ఘన ఖడ్గములను, విష్ణు ధనుస్సు,అమోఘములకు బాణములు ప్రసాదించినట్లు భాస్కర రామాయణంలో కలదు.[11] కానీ ఆగస్త్యుడు రామునికి ఒకే ఖడ్గము ప్రసాదించినట్లు వాల్మీకి రామాయణం నందుగలదు.[12]

### 9. శబరి వృత్తాంతం:

రామున్నిభక్తితో ధ్యానిస్తూ దండకారణ్యంలో జీవిస్తున్న శబరి ఆశ్రమానికి రాముడు వచ్చినట్లు ఆమె చేత పండ్లు భుజించి నట్లు తెలుగు రామాయణాలలో గలదు. ఇది జానపదుల నుండి గ్రహించి తెలుగు కవులు తమ రామాయణాలలో పొందుపరిచినట్లు చెప్పవచ్చు. వాల్మీకి రామాయణంలో శబరి ప్రస్తావన లేదు.

### 10. మందాకిని సీత జాడ చెప్పుట :

శ్రీరాముడు సీత జాడ వెతుకుతూ లక్ష్మణునితో సీతజాడకై మందాకిని సహాయం తీసుకోమని చెబుతాడు. మందాకిని పంచభూతముల ద్వారా సీత జాడ కనుగొని రాముని వద్దకు పోయి సీతాదేవిని రావణుడు అపహరించి తీసుకుని పోయినని తెలుపుతుంది. ఈ విషయాన్ని తెలిపే క్రింది వచనము భాస్కర రామాయణంలో గలదు. **"రామునితో దశకంఠుడు భూమిజ నెత్తుకుని వేగ పోయెను లంకా ధామంబునకని చెప్పు నా మందాకిని**

**నిజాలయంబున కరిగెన్**"[13]. ఇట్టి విషయం వాల్మీకి రామాయణంలో లేదు.

## కిష్కింధ కాండము :

### 11. తారా శాపము :

ఈ కాండంలో ప్రధానంగా కనిపించే అవాల్మీక అంశము "తారా శాపము ". రాముడు వాలిని వధించినందుకు దుఃఖంలో మునిగిన వాలి భార్య తార రావణ వధ అనంతరం రామునికి సీత లభించినను అనతి కాలంలోనే సీత భూ ప్రవేశం గావించి రామున్ని దుఃఖితుణ్ణి చేయునని ' భాస్కర రామాయణంలో క్రింది పద్యంలో వర్ణించడమైనది. "**అచి రేణతు కాలేన త్వయా బా బానై రూపార్జితా న సీతా మమ శాపేన చిరం త్వయి భవిష్యతి ఆత్మన: శౌచమాధార్య పతి వ్రత గుణ సతీ యాచ్యమాన సీత పునర్వాస్యతి భూతలమ్**" (గౌడియ ప్రతి -IV -20,16) భాస్కర రామాయణంలో వర్ణించబడిన ఈ తారా శాపము వాల్మీకి రామాయణంలో లేదు. పట్టాభిషేకానంతరం సీత పరిత్యాగ ఘట్టము నకు ఈ శాపము ప్రధాన భూమిక గా భాస్కర రామాయణ కర్త కల్పించి ఉండవచ్చును.

### 12.లక్ష్మణ రేఖ :

రాముడు మాయా లేడిని బంధించుటకై అడవిలోకి వెళ్ళగా చాలాసేపటి తర్వాత 'లక్ష్మణ లక్ష్మణ' అనే అరుపులు విని, రాముడికి ప్రమాదం పొంచి ఉన్నదని భావించి, సీత లక్ష్మణుని రామున్ని రక్షించుటకై పంపుతుంది. ఆ సమయంలో లక్ష్మణుడు సీతాదేవి రక్షణార్థం వనదేవతలను ధ్యానించి సీతకు రక్షణగా ఉండమని కోరుతాడు. ఈ విధంగా వాల్మీకి రామాయణంలో గలదు. కానీ తెలుగు రామాయణ కర్తలు సీతారక్షణకై లక్ష్మణుడు ఒక రక్షణ రేఖను పర్ణశాల చుట్టూ గీసెనని రాశారు.

### 13. సంపాతి రామ భక్తి :

లంక నగరానికి వెళ్లి సీత జాడను కనుగొని రమ్మని సంపాతి తన కుమారుడైన సుపార్శ్వునికి చెప్పి పంపించినట్లు భాస్కర రామాయణంలో గలదు. కానీ సంపాతి రామభక్తిని చాటుకునే ఈ అంశం వాల్మీకి రామాయణంలో కనబడదు.

### 14. హనుమంతుడు సూర్య బింబమును మింగుట:

హనుమంతుడు బాల్యంలో ఒకసారి ఉదయిస్తున్న సూర్య బింబంను చూసి ఫలమని భావించి దానికోసం ఆకాశానికి ఎగురుతాడు. అది చూసిన ఇంద్రుడు వజ్రాయుధంతో హనుమంతుని కొట్టగా అతని మూతి దవడ(హనువు) పగిలిపోయినట్లుగా వాల్మీకి రామాయణంలో చెప్పబడింది.[14] కానీ భాస్కర రామాయణంలో

హనుమంతుడు సూర్యకిరణాల వేడికి తట్టుకోలేక ఆకాశం నుండి కిందపడుతూ ఒక కొండపై పడగా అతని దవడ(హనువు)పగిలి పోయిందనిచెప్పబడింది. ఇందులో ఇంద్రుని వజ్రాయుధ ప్రసక్తి లేదు.[15]

### 15. తృణాంగిముని ఆశ్రమము :

సీత జాడ కోసం దక్షిణ దిశగా వెతక వలసిందిగా సుగ్రీవుడు హనుమంతునితో చెప్పుతూ తృణంగి అనే ముని ఆశ్రమమును పేర్కొన్నాడు. భాస్కర రామాయణంలోగల ఈ తృణంగి మునిప్రసక్తి[16] వాల్మీకి రామాయణంలో కానరాదు.

## యుద్ధకాండము :

### 16. రామసేతు నిర్మాణ సమయంలో విఘ్నేశ్వర ప్రార్థన :

వానరులు లంకా ప్రవేశం కొరకు రామసేతు నిర్మాణం తలపెట్టినప్పుడు ముందు విఘ్నేశ్వర ప్రార్ధన చేసినట్లు భాస్కర రామాయణం నందు గలదు.[17] ఈ విఘ్నేశ్వర ప్రార్థన వాల్మీకి రామాయణంలో లేదు.

### 17. రావణుడు విభీషణుని తన్నుట, కైకసి విభీషణుని దీవించుట:

సీతను అపహరించడం తప్పు ఇప్పుడైనా సీతను రామునికి అప్పగించి అతనితో సంధి చేసుకోవడం మంచిదని విభీషణుడు తన సోదరుడైన రావణునికి హితబోధ చేస్తాడు. అందుకు రావణుడు కోపోద్రిక్తుడై విభీషణుని అతన్ని తన్ని రాజ్యం నుండి తరిమివేశాడని రంగనాథ రామాయణంలో గలదు[18]. అదేవిధంగా విభీషణుడు రావణుని కొలువులో బంగపడి తల్లి కైకసి వద్దకు వెళ్లి జరిగిన విషయం చెప్పి, తాను శ్రీరాముని శరణ కోరి వెళుతున్నట్లు చెబుతాడు. అప్పుడు కైకసి శ్రీరాముని వద్ద శరణాగతుడవై ఉండమని ఆశీర్వదిస్తుంది.[19] అవాల్మీకమైన ఈ అంశము ఆధ్యాత్మిక రామాయణంలో గలదు.

### 18. మండోదరి సలహా:

రావణ సైన్యంలోని వీరాధి వీరులు వానర సైన్యంతో పోరాడి మరణించగా మండోదరి రావణుని వద్దకు వెళ్లి శ్రీరామునితో క్షమించమని అడిగి సంధి చేసుకోవడం మేలని సలహా ఇచ్చినట్లు భాస్కర రామాయణంలో కనిపిస్తుంది[20]. కానీ ఈ అంశము వాల్మీకి రామాయణంలో కనబడదు. మండోదరి రావణుల సంభాషణ దేశీయంగా లభిస్తున్న రామాయణాలలో ఉన్నట్లు మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు రంగనాథ రామాయణం పీఠికలో తెలిపారు [21].

## 19. కాలనేమి వృత్తాంతం:

భాస్కరరామాయణంలో యుద్ధకాండలో వర్ణించబడిన అవాల్మీక అంశాలలో కాలనేమి వృత్తాంతం ప్రధానమైనది. ఈ ఘట్టం భాస్కరరామాయణంలో సుమారు106 గద్య పద్యాలలో వర్ణించబడింది. ఇది ఒక మనోహరమైన లఘుకావ్యంగా భాసిల్లుతున్నది.[22] ఆధ్యాత్మిక ఆనందరామాయణాలలోనూ ఈవృత్తాంతం గలదు[23].

## 20. భరత-హనుమతులు:

భాస్కర రామాయణంలో హనుమంతుడు ఆకాశమార్గాన వెళ్తున్నప్పుడు హనుమంతుని చూసిన భరతుడు భూతమని భావించి విల్లు ఎక్కు పెట్టడం[24] అవాల్మీకమైన అంశమే.

## 21. రావణుడి ప్రాణ రహస్యం:

ఎన్ని బాణాలు వేసినా రావణుడు మరణించక అతని తలలు ఎన్నిసార్లు ఖండించినా మళ్లీ రావడంతో విసిగిపోయి ఉన్న రాముని వద్దకు విభీషణుడు వచ్చి, రావణుని ప్రాణ రహస్యం అతని నాభియందు గల అమృత కుండలంలో గలదని, దానిని పగలగొట్టిన రావణుడు మరణించునని విభీషణుడు చెప్పుతాడు. అంతట రాముడు నాభిని ఛేదించినట్లు భాస్కర రామాయణంలో మరియు ఆధ్యాత్మిక రామాయణం నందు గలదు[25]. ఇది వాల్మీకి రామాయణంలో లేని అంశము.

## 22. రావణ కాష్టము :

యుద్ధంలో రావణుడు మరణించిన తర్వాత రావణుని పార్థివ దేహం వద్ద మండోదరి విలపిస్తూ, భర్తను కోల్పోయిన స్థితికి దుఃఖిస్తుంది. ఈ పరిస్థితిని చూసిన రాముడు మండోదరితో నీ ముత్తయిదువ తనం పోకుండా నేను కాపాడుతాను అని రావణుని రావణుని అంతిమ క్రియలలో అతని కాష్టము చల్లారకుండా కాలుతూనే ఉండే విధంగా రాముడు అభయమిచ్చాడు. తద్వారా అంత్యక్రియల తంతు ముగిసిన తర్వాత విధవరాలుని చేసే అవకాశం ఉంటుంది. అలా కాకుండా రావణుని కాష్టం నిత్యం కాలుతూనే ఉండే విధంగా చేశాడు రాముడు. కనుక మండోదరి విధవరాలు అయ్యే అవకాశం లేదు. భాస్కర రామాయణంలోనూ, రంగనాథ రామాయణంలోనూ ఈ విషయం కనిపిస్తుంది.ఇది జానపద కథల నుండి తెలుగు రామాయణ కర్తలు గ్రహించి ఉంటారు. కానీ రావణ కష్టం నిత్యం కాలుతూ ఉండడం అనే అంశం వాల్మీకి రామాయణంలో లేదు. శత్రువు అయినను రాముడు తగిన రీతిలో రావణుని దేహానికి గౌరవంగా అంత్యక్రియలు జరిపించాడు. రావణుని దేహానికి అంత్యక్రియలు జరిపిన తీరు వాల్మీకి రామాయణంలో గలదు.

## ఉత్తరకాండము:

### 23. చాకలి వృత్తాంతము:

వాల్మీకి రామాయణం ఉత్తరకాండము 43వ సర్గ శ్లోకం 3-6 వరకు గల ఈ అంశాన్ని పరిశీలించినట్లయితే రాముడు తన గూడచారి అయిన భద్రుని పిలిచి "**భద్ర నగరంలో జరుగుతున్న విశేషములు ఏమిటి? పౌరులు నా గురించి, నా పాలన గురించి ఏమనుకుంటున్నారు. సువిశాల రాజ్యంలో రాజుల గుణదోషాల గురించి ప్రజలు చర్చించుకోవడం సహజమే కదా. యదార్థ విషయాలన్నీ పూర్తిగా తెలుసుకొనుము**" అని ఆదేశిస్తాడు. ఆ విధంగా రాజ్యంలో తిరిగి సమాచారం సేకరించిన భద్రుడు చెప్పిన సమాధానం ఈ శ్లోకంలో గలదు. వాల్మీకి రామాయణం ఉత్తరకాండ 43వ సర్గ శ్లోకం12-16: "**కీ దృశ్యం హృద్యమే తస్య సీతా సంభోగజమ్ సుఖమ్ అంక మారోప్యతు పురా రావణ న బలాదృతామ్**." సీతతో సుఖించుటకై శ్రీరాముని మనసు ఇలా ఇష్టపడుతుంది లోగడ రావణునిచే అపహరించబడి అతని అశోకవనంలో చాలా కాలం రావణుని ఆధీనంలో ఉన్న సీతను రాముడు ఎందుకు ఏవగించుకోవడం లేదు. ఇక మీదట మన భార్యల పట్ల కూడా మనం ఇలాంటి సహనమే చూపాల్సి రావచ్చు. రాజు మార్గమునే ప్రజలు అనుసరింతురు కదా. రాజా.. నగరం అందున అన్ని జనపదాలలో ప్రజలు ఇలా అనేక రీతులలో నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు. అని భద్రుడు రాముని తో చెప్పాడు. ఇందులో ఎక్కడ కూడా చాకలివాడు రామున్ని దూసించినట్టు తప్పు పట్టినట్లు లేదు. ఇది ఒక కాల్పనిక కథ, జానపదుల సృష్టి, ఈ అవాల్మీకమైన కథను అనేకమంది తెలుగు కవులు తమ రామాయణాలలో పొందుపరిచారు.

### 4. ముగింపు:

పైన పేర్కొన్న అనేక అంశాలు వాల్మీకి రామాయణంలో లేవు. కొన్నింటిని ఔచిత్యం కొరకు, మరికొన్ని చమత్కారం కొరకు, ఆయా ప్రాంత ప్రజలు దేశీయంగా చెప్పుకునే కథలను కవులు తమ రామాయణాలలో చొప్పించి ఉండవచ్చు. కొన్ని సందర్భాలలో చమత్కారం కొరకు ఇతర రామాయణాల నుండి, పురాణాల నుండి, జానపద వ్యాపితమైన అనేక రామకథల నుండి, జైన బౌద్ధ రామకథల నుండి, ఇతర భారతీయ భాషల రామాయణ కథల నుండి తెలుగు రామాయణ కర్తలు గ్రహించి కొన్నిచోట్ల విస్తరించడం కొన్నిచోట్ల విస్మరించడం మరికొన్నిచోట్ల లేనివి జోడించడం చేశారు తమ ప్రాంతీయ అస్తిత్వాన్ని చాటుకునే ప్రయత్నం చేశారు. రామాయణ గాధ భారతీయుల జీవితంతో అనునిత్యం పెనవేసుకొని ఉంటుంది. రామకథప్రభావం లేని తెలుగు ప్రజలు, రామాలయం లేని తెలుగు గ్రామం లేదు అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. రామ కథలో ఎన్ని అంశాలు కొత్తగా చేరినను ఆ కథా మాధుర్యం తరతరాలు దేశ ప్రజలను నిత్యం అలరిస్తూ కమనీయంగానే ఉంటుంది.

## 5. పాదసూచికలు:

1. వాల్మీకి రామాయణము I -48-31.
2. ఆధ్యాత్మిక రామాయణము I-6,14; రంగనాథ రామాయణము పుట.50.
3. రంగనాథ రామాయణము పుట.16
4. రంగనాథ రామాయణము పుట.167.
5. రంగనాథ రామాయణము పుట.19.
6. రంగనాథ రామాయణము పుట.89.
7. భాస్కర రామాయణము II-292-293.
8. ఆనంద రామాయణము ,సారకాండము IV, 86-90.
9. భాస్కర రామాయణము II-433-440.
10. భాస్కర రామాయణము II-266.
11. వాల్మీకి రామాయణము, III - పుట.1,98.
12. వాల్మీకి రామాయణము, III - పుట.1,32-34.
13. భాస్కర రామాయణము II- పుట.2,3,11.
14. వాల్మీకి రామాయణము, IV- పుట.60,22-23.
15. భాస్కర రామాయణము IV- పుట.809.
16. భాస్కర రామాయణము IV- పుట.561.
17. భాస్కర రామాయణము VI- పుట.148.
18. రంగనాథ రామాయణము పుట.301-302.
19. భాస్కర రామాయణము VI- పుట.11-12.
20. భాస్కర రామాయణము VI- పుట.19,36-38.
21. రంగనాథ రామాయణము (రాయల్ &కో 1957) పీఠిక పుట.25.
22. భాస్కర రామాయణము VI- పుట.1617-1723.
23. ఆనంద రామాయణం VI 6, 36 to 7,33.
24. భాస్కర రామాయణము VI- పుట.1738-1765.
25. రంగనాథ రామాయణము (రాయల్ &కో 1957) పీఠిక పుట.25-26.

## 6. ఉపయుక్తగ్రంథసూచి:


1. నరసింహారెడ్డి. డి,(2000), వాల్మీకి రామాయణం -సంబంధాలు, సుదర్శన్ పబ్లికేషన్స్, తిరుపతి.
2. రంగస్వామి అయ్యంగారు, వంగిపురం,(2013), రామాయణరహస్యరత్నావళి, తి.తి.దే, తిరుపతి.
3. శ్రీరామచంద్రుదు, పుల్లెల,(1993), శ్రీమద్రామాయణము- అరణ్యకాండము, అర్ష విజ్ఞాన ట్రస్ట్, హైదరాబాద్.
4. శ్రీహరి,రవ్వా.(1988),భాస్కరరామాయణము-విమర్శనాత్మకపరిశీలనము,మొదటిసం,పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు.
5. సంగమేశం, ముట్నూరి, (1996), వాల్మీకి రామాయణము శాపములు -వరములు, శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్స్, హైదరాబాద్.


***

**గమనిక:** ఈ పత్రికలోని వ్యాసాలలో అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి.

వాటికి సంపాదకులు గానీ, పబ్లిషర్స్ గానీ ఎలాంటి బాధ్యత వహించరు.